# గురజాడ స్త్రీపాత్రలు

## (ఆంధ్ర సాహితికి కూర్చిన ముత్యాల సరాలు)

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

మోసము, కుట్ర, లంచగొండితనము, స్వార్థపరత్వము, అసత్యభాషణము, కుయుక్తి, కూటసాక్ష్యము, ఎవరిదగ్గఱ వారిమాటలాడి తప్పించుకోవడము, అన్నింటికీ మించిన శీలరాహిత్యమూ మొదలైన అవినీతులకూ, అక్రమాలకూ ఆటపట్టయినసంఘాన్నీ అటువంటి సంఘంచేత సులభంగా మోసపోయే అమాయక వ్యక్తులనూ కలిపి ఒక గొప్ప నాటకం వ్రాశారు; అప్పారావుగారు ! అదే కన్యాశుల్కం.

కన్యాశుల్కం ఆనాటి సంఘ దుర్నీతికి ఒక గొడ్డలిపెట్టు. ఈ నాటకానికి ఆనాడు మిక్కిలి వ్యవహారంలో ఉన్న ముసలి పెండ్లికొడుకుల దగ్గఱ శుల్కం తీసుకొని ముక్కుపచ్చలారని ముగ్ధా కన్యలను ఇచ్చి పెండ్లిచేయడమనే ఘోరదురాచారం వెన్నుపూస. ఇంక ఈ దురాచారానికి బలిపశువులై పోయిన అమాయక స్త్రీలు సమాజంలోని దుష్టులకు తట్టుకోలేక అవినీతికి పాల్పడడమూ, వాని వలన ఉత్పత్తిల్లే అసహ్య సంఘటనలూ, ఘోర ప్రమాదాలూ, సంఘాన్ని అధఃపాతాళానికి త్రోసి వేసే భయంకర పరిణామాలూ, ఈ నాటకంలో అడుగడుగునా మనలను ఎదుర్కొంటూనేఉంటాయి.

అయితే అప్పారావుగారి అప్రతిమాన రచనా శిల్పచాతుర్యంచేత, ఎంత అసహ్యమైన సంఘటనైనా, ఎంత భయంకర ప్రమాదమైనా నవ్వులలో తేలి మఱుగుపడుతుంది. అంత సూక్ష్మమైన వ్యంగ్య పద్ధతితోకూడిన సున్నిత హాస్యంతో ఆనాటి దురాచారాలపై వారు పుంఖపుంఖాలుగా రచనా బాణాలు గురితప్పకుండా విడిచారు. అదే వారి రచనలో ఉండే అద్భుత శిల్పం !

నిజానికి కన్యాశుల్కంలోని పాత్రలవంటి వ్యక్తులు కొంచెం హెచ్చుతగ్గు పాళ్ళలో ప్రతీ కాలంలోనూ ఉంటారు. అయితే అప్పారావుగారి కాలం నాటికి మన తెలుగుదేశంలో ఉన్న అవిద్య, అజ్ఞానమూ, సంస్కార విహీనత, మూఢ విశ్వాసాలూ, దురాచారాలూ ముఖ్యంగా ఆంగ్లేయ విద్య ఇంకా అంతగా అల్లుకోనందువలన వ్యాపించి ఉన్న అనాగరకతా మొదలైన వాటివలన లుబ్ధావధాన్లు, అగ్నిహోత్రావధాన్లు, రామప్పంతులు మొదలగు పాత్రల స్వభావాలు మనకి నాగరక కాలంలో మఱీ మోటుగా కనబడవచ్చు. కాని నాగరకతకు పేరుమోసిన యీ కాలంలోకూడా తడిగుడ్డలతో గొంతులు కోసేరకంగా ప్రబలమైన దుర్ణయాలు సున్నితంగా రెండోకంటికి తెలియ

కుండా సంఘంలో గుట్టుచప్పుడుగా జరిగిపోతున్నవి.

అయితే ఈనాటి దుర్ణయాలకు కారణభూతులైన వ్యక్తులంతా ఆంగ్లేయవిద్య నధిగమించి, మహా ప్రజ్ఞావంతులై, పెద్ద పెద్ద పదవులలో ఉండి సాటి మానవుడి క్షేమాన్నేకాదు, తమ స్వార్థానికి అడ్డువస్తే తోడి మానవజీవాన్నె నాగరక పద్ధతుల్లో నల్లిక్రింద నలిపి పారేస్తూన్న వారవడంచేత ఈసుకుమార రూపభయంకరావినీతి పిశాచ విహారానికి ఎక్కడా అంతూపొంతూ కనబడ్డంలేదు.

కన్యాశుల్కం ఆనాటి సంఘజీవిత సర్వస్వమని పఠితలకు వేరే చెప్పనక్కఱలేదుకదా! అనేక జాతులూ, వృత్తులూ, దృక్పథాలూ, భావసంఘర్షణలూ, దురాచార పరిణామాలూ, వాటి వాటి సహజరూపంతో, సహజమైన భాషలతో, ప్రవర్తనలతో కళ్ళకు కట్టినట్లు అందులో చిత్రించబడ్డాయి. ఆనాటి సంఘప్రవృత్తికి కన్యాశుల్కం అద్దంవంటిది.

అలాంటి సంఘంపై కవికి గల జాలీ, ప్రేమా, ఆదరాభిమానాలూ, "నా సంఘం ఇంత హీనంగా ఉన్నదే, దీన్ని నా చేతనైనంతవఱకూ ఉద్ధరిద్దా" మనే దీక్షా కవిచే అంత గొప్పనాటకాన్ని సృష్టింపజేశాయి. అప్పారావుగారు సహజంగా ఒక గొప్ప ఉదాత్త వ్యక్తి. ఆయన తనంతట తాను వెలుగుబాటలలోకి నడవడమేకాక, తన తోడి తెలుగు సోదరులను కూడా వెలుగులోకి తీసికొని వెళ్లాలని ఆ మహాకవి పడిన ఆవేదన, తాపత్రయమే ఆ మహానుభావుడి రచనల రూపంలో పొంగులు తెలుగువారి సహజ రసజీవనంతో కలిసి పరవళ్లు త్రొక్కింది. స్వభావతః ఆవేశపరులైన తెలుగు వారికి ఆవేశరహితమైన సహజ ధోరణిలో కన్యాశుల్కాన్ని రచించి సమాజానికి హితము గఱపినారు; అప్పారావుగారు!

అందులోనూ కన్యాశుల్కంలోని స్త్రీపాత్రలు చాలా ఉద్రేకరహిత పాత్రలు. దుర్వృత్తిలో ఉన్న స్త్రీపాత్రలనూ చదువుతూ ఉన్నా పఠిత కేటువంటి భావోద్వేగమూ, వికారప్రవృత్తీ కలుగనంత సహజంగా పాత్రచిత్రణం చేశారు. కన్యాశుల్కంలోని మగపాత్రలన్నీ—ఒక్క సౌజన్యారావు పాత్ర తప్ప, అకూట ప్రవృత్తితో స్వార్థంకోసం సమాజాన్ని వేటాడిన ఆర్భాటపు పాత్రలే. స్త్రీపాత్రలుమాత్రం చాలావఱకు స్వచ్ఛశీలమూ, అమాయకతా ధనంగా గలిగిన మేలిపాత్రలవడమే కాక, ఎంత అమాయక పాత్రలో అంత ఉదారస్వభావముకల పాత్రలు కూడా అయి ఉన్నవి.

అగ్నిహోత్రావధానుల భార్యయైన వెంకమ్మ, కుమార్తెయైన బుచ్చెమ్మ అమాయకతకు ఎంతగా సరియైన ప్రతిబింబాలో, అంతగా సమాజాచారాలకు, కఠోరతకూ లొంగిపోయిన బలహీనపాత్రలు. లుబ్ధావధానుల కుమార్తె మీనాక్షి అమాయకురాలు అవునో కాదో! కాని సంఘంలో పేరుకుపోయిన అవినీతికి, దౌష్ట్యానికి ఆహుతిఅయిపోయిన బలిపశువు. అయతే వారి మనస్సులలో మాత్రం స్త్రీ సహజమైన ఔదార్యానికి మాత్రం భంగం వాటిల్లనీయడు; కవి!

నిజానికి అగ్నిహోత్రావధానుల భార్యయైన వెంకమ్మను చూస్తే జాలివేస్తుంది; పాపం! ఆమె సరిగ్గా పుణ్యం పాపం ఎఱుగని ఒక నిస్సహాయ హిందూ గృహిణికి మచ్చుముక్క. పేరు చేత మాత్రమేకాక ప్రవృత్తిచేత కూడా అగ్నిహోత్రమే అయిన తన భర్త భయంకర, నిరంకుశ స్వభావానికి లోబడి నుసి అయిపోయిన అతి సామాన్య గృహిణి వెంకమ్మ. అయినా శుల్కం తీసుకొని మూడు కాళ్ల ముసలికిచ్చి పెండ్లిచేసిన ఫలితంగా అభం శుభం తెలియకుండానే వితంతువై అఘోరిస్తూ

ఉన్న పెద్ద పిల్ల బుచ్చెమ్మ అవస్థకే కుళ్లిపోతూ ఉన్న ఆ తల్లి హృదయం రెండవ పిల్లను కూడా ధన లోభంతో భర్త మళ్లీ శుల్కం తీసుకొని చావుకు సిద్ధమైయున్న లుబ్ధావధానులకిచ్చి పెండ్లి చేయ నిశ్చయించుకొన్నాడని తెలియగానే విలవిలలాడి పోతుంది. అయినా ఛండశాసనుడైన భర్త ఇచ్ఛకు వ్యతిరేకంగా ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు.. ఇక ఆ అన్యాయం సహించలేకపోతే తనకు మిగిలిన సాధనమల్లా తాను ప్రాణం తీసుకోవడమే. అందుకనే ఆమె తన తమ్ముడైన కరటకశాస్త్రితో "అన్నయ్యా, యీ సమ్మంధం చేస్తే నేన్నుయ్యో గొయ్యో చూచుకొంటాను. పెద్దదాన్ని రొమ్ముల మీద కుంపట్లాగ భరిస్తూనే ఉన్నాం. ఆయనకి ఎంత యీడొచ్చినా కష్టం సుఖం వొళ్లు నాటక ఈ దౌర్భాగ్యం సమ్మంధం కల్పించుకొచ్చారు. నేను బతికి బట్ట కట్టాలంటే ఈ సమ్మంధం తప్పించు" అని బ్రతిమలాడుకొంటుంది. ఒక్క వెంకమ్మే కాదు, బుచ్చెమ్మ కూడా ఈ సమ్మంధానికి ఎంతో బాధ పడ్తుంది. కన్యాశుల్కంలోని రామప్పంతులూ, అగ్నిహోత్రావధాన్లూ తప్ప తక్కిన ప్రముఖ పాత్రలన్నీ ఈ వివాహం తప్పించడానికే నానా పాట్లూ పడ్తారు. ముఖ్యంగా స్త్రీ పాత్రలన్నీ ఈ అభిప్రాయన్నే కనబరుస్తాయి. వెంకమ్మకు ఈ సమ్మంధం ఎంత యిష్టం లేకపోయినా భర్త అఘాయిత్యానికి తానే లొంగిపోయి పెళ్లికి వెళ్తుంది కాని ఏమీ చేయలేకపోతుంది.

ఇక బుచ్చెమ్మను గూర్చి చెప్పనే అక్కర్లేదు. బుచ్చెమ్మంత అమాయకురాలు లోకంలోఉంటుందా అనిపిస్తుంది. తన స్థితి యెంత శోచనీయమో కూడా కానుకోలేనంత అమాయకురాలు ఆమె! ఆమెను గూర్చి గిరీశం వెలిబుచ్చిన అభిప్రాయాలే ఆమె కొక పెద్ద యోగ్యతా పత్రం. "ఇంత సింప్లిసిటీ యక్కడా కానలేదు. దీనికి లవ్ సిగ్నల్సు రామ రామా ఏమీ తెలియవు. చమత్కారం మాటలు ఆడితే ఏమిన్నీ అర్థం చేసుకోలేక ఆ లేడికళ్లతో తెల్లబోయి చూస్తుంది..." ఇంతకు మించి ఆమె అమాయకతను గూర్చి వేరే ఏమీ చెప్పనక్కఱలేదు. ఇంత శుద్ధ పల్లెటూరు నాటుసరుకును కూడా గిరీశం ఆఖరుకు బుట్టలో వేసుకోగలిగాడు. దానికి కూడా బుచ్చెమ్మకు చెల్లెలి పెండ్లి తప్పించాలన్న ఔదార్యమే కారణంగా చూపి గిరీశం ఆమెను వశం చేసుకో గల్గుతాడు. కాని యింకేవిధంగానూ గిరీశం తస్సాలు ఆమెమీద పని చెయ్యలేవు. బుచ్చెమ్మ నిజంగా ఒక స్వచ్ఛసుందర కమలం! అయితే మాత్రమేమి? సంఘాచారం ఆమెనుగూడా లో బఱచుకో గల్గింది.

ఇంక లుబ్ధావధానుల వితంతు కుమార్తె మీనాక్షి ఉన్నది. సమాజదురాచారాల యొక్క యినుప పిడికెళ్ళలో నలిగి తుత్తుమురై పోయిన దుర్బలురాలు! మీనాక్షి! శుల్కంతీసుకొని ఏడు కట్ల సవారిలో పెళ్ళి పేరున పెండ్లికొడుకుతో ఊరేగిరేచబడి పీక నులివేయబడ్డ నిస్సహాయురాలు! పాపం! మీనాక్షి!!.

కన్యాశుల్కం నాటకం అంతా చదివితే కవికి ఆనాటి సంఘదురాచారాలమీద ఉన్న కఱా, దానికి బలైపోయిన స్త్రీల మీద ఉన్న జాలీ కలిసి మీనాక్షిగా రూపొందిందా? అనిపిస్తుంది! మీనాక్షి దుశ్శీలానికి బాధ్యురాలు కాదు. సామాజిక కరోరాచారములు, రామప్పంతులు వంటి నరరూప రాక్షసులూ బాధ్యులు. ఆ కళంకం ఆనాటి తెలుగు సంఘానిదే. అన్నిపరిస్థితులూ బాగా ఉండి కూడా దుశ్శీలానికి అలవాటు పడితే అప్పుడావ్యక్తి క్షంతవ్యం కాదు. కాని మీనాక్షి విషయంలో మనం అట్లా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించడానికి వీలులేదు.

ఇక పూటకూళ్ళమ్మ విషయం నేను వ్రాయ దలచుకోలేదు. ఇక కన్యాశుల్కంలోని స్త్రీ పాత్ర లకేకాదు; అన్ని పాత్రలకూ కొలికిపూస మధుర వాణి !! మధురవాణి వంటి జాతిమణి మనుష్య లోకంలోనే ఉద్భవించవలసిందికాదు. ఆమె అసలు మనుష్య సృష్టికే అలంకార ప్రాయమైన ఒక సుందర స్వప్నం !

మధురవాణి పాత్రను గూర్చి మనం ముచ్చ టించక ముందు గురుజాడవారు తన రచనలలోని స్త్రీ పాత్రల సృష్టిలో చూపిన ప్రధానమైన వింగ డింపును గూర్చి కొంచెం తెలుసుకోవాల్సిన అవస రం ఉన్నది.

ఆయన ముత్యాల సరాలలోనూ, కథలలోనూ మనకు పరిచయం చేసిన స్త్రీ పాత్రలన్నీ గొప్ప వ్యక్తిత్వంతో కాలగతికీ, సంఘ దురాచారాలకూ ఎదురు తిరిగి గుర్తుంచుకోదగిన ఒక నూత్న పరిణా మాన్నో, లేక ప్రయోజనాన్నో సాధించిన శక్తి చైతన్యముకల మహత్తర పాత్రలు. దేశంయొక్క తమ పరిసర వాతావరణంయొక్క ప్రభావాలకు లొంగిపోకుండా ధీరత్వంతో కష్టాలను ఎదిరించి జయం సాధించిన స్త్రీ పాత్రలు వారి పదాల లోనూ, కథలలోనూ మనకు కనబడతాయి.

కన్యాశుల్కంలో పాత్రలు మాత్రం అట్టివి కావనీ కాలానికి కట్టుబడిన పాత్రలని మీకు ఇంతకు ముందే రూపించి ఉన్నాను. అయితే మధురవాణి ఒక్కతె మాత్రమే ఆసాంప్రదాయానికి వ్యతిరే కంగా నిలిచి వ్యక్తిత్వం పరిధులు ముట్టిన స్త్రీపాత్ర. కుళ్ళూ కుహకాలతో నిండి తన చుట్టూ బలసి తన "కొంగు తగిలినాచాలు కొంతవాసి!" అని తాప త్రయపడే గిరీశం, రామప్పంతులు, హెడ్డు, కరటక శాస్త్రి మొదలైన భిన్నభిన్న ప్రవృత్తులు కలవా రందఱితోనూ 'మూఢం ఛందానురోధేన' అన్నట్లు వారివారి తత్త్వాల కనుగుణంగా మసులుకుంటూ ఉన్నట్లే నటిస్తూ కుమ్మరిపురుగువలె ఎవ్వరికీ ఆకు కందకుండా! పోకకు పొందకుండా తప్పించుకొని తిరిగి, వేశ్యయే అయినా మానవసంఘం మనుగడకు కావలసిన నీతీ నిజాయితీ చూపించిన శీలవతి! మహా మేధావి !! మధురవాణి !!!

ఆమె అపురూప సౌందర్యం లంపటులైన గిరీశం, రామప్పంతుళ్ళనూ, వృద్ధుడైన లుబ్ధావధానులనూ, వివేకి రసికుడూ అయిన కరటకశాస్త్తుర్లనూ, చిన్న పిల్లవాడైన శిష్యుణ్ణీ, పోలీసుశాఖకు చెందిన హెడ్డునూ, ఆదర్శపురుష శిరోమణియైన సౌజన్య రావునూ ఒక్కవిధంగానే ఆకర్షించింది. ఆకర్షించ డమే కాదు ఉచ్చులు వేసి లాగిలాగి కొట్టింది. మోహాపు సుడులలో గిరగిరా త్రిప్పిత్రిప్పి గిరవా చేసింది. తను మాత్రం ఎవ్వరకూ తన అంతర్యం చిక్కనీయనంత చిక్కని చక్కని మానిసి అని మాత్రం చదువరులు మఱచిపోగూడదు.

జనాకర్షణలో ఆమెకుగల ఆయుధాల్లో ఆమె సౌందర్యం ప్రధానాస్త్రం. మాటచమత్కారం రెండవ అస్త్రం. వీటిని మించినవి ఆమె నిర్మల స్వభావమూ, మనోహరమైన ఉపకారశీలమూను. అన్నింటికీ మించినవి ఆమె వ్యవహారదక్షతా, రసజ్ఞ తలు. ఇంత సాధనాసామగ్రి ఒక వేశ్యపాత్రకొఱకు శ్రమకోర్చి సమకూర్చారు; అప్పారావుగారు! కాని వారి శ్రమ ఏమీ వ్యర్థం కాలేదు. ఆ మధురం పాత్రలో వారి శ్రమ అంతకు నూరింతలు వేయిం తలుగా ఫలించింది. మధురవాణి లేకపోతే కరటక శాస్త్రి అన్నట్లు కథే లేదు.

కావ్యం వ్రాయగానే కవికాడు. సంఘంలోని కుళ్ళును తూర్పారబట్టాలనే ఉద్దేశం ప్రధానంగా పెట్టుకొని అప్పట్లో అప్పారావుగారే కాక వీరేశ లింగం పంతులుగారు కూడా చాలా వ్యంగ్యరచనలు

చేశారు. కాని ప్రచారవేగంచేతనో ఏమో వారి రచనలలో గురుజాడవారి రచనలనుండి తొంగి చూచే మనోహరశిల్పం కానరాదు. అప్పారావు గారి రచనల్లో ప్రయోగనైపుణ్యమేకాక, ప్రచార సిద్ధికూడా అంతకు పదింతలు ఫలించిం దనడానికి లోకమే సాక్షి!

అప్పారావుగారి పాత్రలు సజీవంగా - మూర్తిమంతములై పాఠకుల కళ్ళముందు కలకాలం కాపురం చేస్తాయి. ఎదురుగుండా నిల్చొని పలకరించినట్లో, సరసంగా పన్నీరు చిలకరించినట్లో, ప్రక్కగా చేరి కనబడకుండా గిలిగింతాలు బెట్టి నవ్వించినట్లో, వ్యవహారదక్షతతో కజ్జాకు కాలు దువ్వకుండానే కవ్వించినట్లో వీరి మధురవాణి అంరఅనూ ఋలిపిస్తుంది. మధురవాణి అర్థం చేసుకున్నవారికీ చేసుకోలేనివారికి కూడా సౌరుగల కోమలియే. కాని కొయ్యబొమ్మ కానే కాదు.

సంపూర్ణమైన మానవత్వం మూర్తీభవించిన పూర్ణకుంభం మధురవాణి నవ్వినా, కోపం అభినయించినా, మాటలాడినా, మన్నన చేసినా, మంత్రాంగం చెప్పినా, తంత్రమర్యాద చేసినా, ఏమిచేసినా చెయ్యకపోయినా నిండైన మాధుర్యం, ఒయ్యారం, రసజ్ఞతా ఒలికి ఒలికి పరిమళించి ఎదుటివారినిసైతం గుబాళింపజేస్తాయి. ఆ స్పందనకు లోబడని వ్యక్తి మానవాతీతుడైనా కావలె- లేక మానవుడు కానివాడైనా అయి ఉండాలె. అంతే కాని మానవుడైనవాడుమాత్రం లోబడకమానడు. మసిపాత గట్టినా మాణిక్యంప్రభలు దాగనట్లు ఏ జన్మయోగమో భ్రష్టమై కాలుజారి ఆమె వేశ్యాకులంలో పుట్టినా మంచితనం కించిత్తుకూడా ఎక్కడా కుంటుపడలేదు - రామప్పంతులు వంటి మహా లౌక్యులను కూడా ఏమీ ఖాతరు చెయ్యకుండా నిలువున నిలువబెట్టి వాళ్ల అక్రమాలను దులిపి దులిపి బుద్ధిచెప్పేది. అయితే ఆమెలో ఉన్న సహజ మృదుశీలముచేత అవన్నీ మెత్తని చెప్పుతో కొట్టినట్లే ఉండేవి. రామప్పంతులుతో ఆమె అన్న మాటలు చిత్తగించండి: "తాను చేస్తే లౌక్యం మఱొకడు చేస్తే మోసం అనరాదా? అబద్ధానికి అర్థ మేమిటి?" అట్లని యోగ్యుల నామె మన్నింపక పోలేదు. యోగ్యుడైన కరకటశాస్త్రుల్లకు మధురవాణి యెంతో సహాయం చేసింది. అయినా అతగాణ్ణికూడా పప్పులో కాలు వేసినపుడు మెత్తమెత్తగా అంటించడం మానలేదు. "చిత్రగుప్తుడికి లంచం ఇయ్యగలరా? అతగాడి దగ్గఅకు కూడా మధురవాణిని పంపి చేసినపాపాలు అన్నీ తుడుపు పెట్టించుకోడానికి వీలు ఉండదు కాబోలు!" కరటకశాస్త్రితో అన్న ఈ మాటల్లోనూ, కరటకశాస్త్రి తనతోబాటు ఈ దుష్టవ్యవహారాల్లో త్రిప్పుతూఉన్న తనశిష్యునికే తనకూతురు నిచ్చి అల్లుణ్ణిచేసుకుంటాడన్న విషయం తెలిసినపుడు "యిక అతణ్ణి నాటకా లాడించీ, ముండలిళ్ల తిప్పీ చెడగొట్టకండి" అన్న మాటల్లోనూ మధురవాణి మధురసంస్కారం, అమలిన హృదయమూ బాగా తెల్లమౌతుంది. పంకంలో పుట్టినా పద్మినీజాతికి చెందిన స్త్రీరత్నం! మధురవాణి!!

కరటకశాస్త్రి అన్నట్లు "మధురవాణి అంటూ ఒక వేశ్యశిఖామణి యీ కళింగరాజ్యంలో పుట్టి వుండకపోతే భగవంతుడి సృష్టికి యంతో లోపం వచ్చివుండును."

ఇక రెండవ భాగానికి చెందిన స్త్రీ పాత్రలు ముత్యాల సరాలలోను, కథలలోనూ మనకు ప్రత్యక్షమౌతారు.

"వేల్పు లలనల కేవి వెలితోగ" వలె మింట వెలుగుతూ ఉన్న ధూమకేతువును శ్రీ అప్పారావు

గారు "సంఘ సంస్కరణ పతాకగా" భావించి యిల్లాలికి తద్వారా

"జాతి బంధములన్న గొలుసులు
జారి సంపదలుబ్బెడున్."
"యెల్లలోకము వొక్కయిల్లై
వర్ణభేదము లెల్లకల్లై,
వేల నెఱుగని ప్రేమబంధము
వేడుకలు కురియ
మతములన్నియు మాసిపోవును
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గసుఖంబులన్నవి
యవని విలసిల్లున్"—

అని ఆనాటి సంఘ సంస్కారోద్దేశాలను ప్రబోధిస్తూ అంతతో ఊరుకోక సంఘ సంస్కారాస్త్రాలలో ప్రధానంగా వజ్రాయుధమైన సకల జాతుల విందు (కాస్మాపాలిటన్ డిన్నరు) లో మంచిని కూడా ఆమెకుద్బోధింపబోయి—

"మొన్న పట్టమునందు ప్రాజ్ఞులు
మొట్టమొదటిది మెట్టు ఇదియని
పెట్టినారొక విందు ; జాతుల
జేర్చి ; వినవై తో......"

అని మెల్లగా చీకటి తురుపును కాస్తా బయట పెట్టారు.

దానితో ఇల్లాలికి నసాళం అంటింది. అసలే భర్తగారి సంఘ సంస్కారం గొడవతో కొడుకు నేమీ వారించలేక తనమీద విరుచుకుపడుతూ ఉన్న అత్తమామల కొత్త కొసరింపులకు ఆమె నిత్యమూ తట్టుకోలేకపోతూ ఉన్నది. సమయం చూచి ఎప్పుడో భర్తతో మనసులో మాట చెప్పాలనే ఆమెకూడా వేచి ఉన్నది.

"వింటి మీ పోకిళ్ళు వింటిని
కంట నిద్దుర కానకుంటిని
యీ చిన్నమనసును చిన్నబుచ్చుటె
ఎన్నికని యోచించిరో
తోటికోడలు దెప్పె ; పోనీ
సాటివారోదార్చె ; పోనీ
మాటలాడక చూచి నవ్వెడి
మగువకేమందున్"
తోడు దొంగని అత్తగారికి
తోచెనేమో యనుచు గుందితి
కాలగతి యని మామలెంతో
కలగ సిగ్గరినై
చాలు నహి మీ చాకచక్యము
చదువుకిదె కాబోలు ఫలితము
ఇంతయగునని పెద్దలెఱిగిన
యింగిలీషులు చెపుదురా...
కలసి మెసగిన యంతమాత్రనె
కలుగబోదీ యైకమత్యము
మాల మాదిగ కన్నె నెవతెనో
మరులుకొనరాదో-"

అంటూ కడుపులోని అక్కసు కాస్తా హైడ్రోజన్ బాంబులా భర్త మీద కక్కేసి మెడలో దండలు తీసి ఆయన మొఖాన్న గిరవాటేసి సరసరా లోపలికి వెళ్లిపోయింది!

పాపం! కవి కాబట్టి అంత కోపంతో విదిలించి వెళ్లిపోయినా, "కొమ్మెరుగు చాడ్పున" అని ఆమె నడకకు మంచి ఉపమానం వేసుకొని, "లోకమందలి మంచి చెడ్డలు లోకు లెఱుగుదురా?" అని తన సంఘ సంస్కరణోద్యమానికి తానే భరతవాక్యం పాడుకొని సరుదుకొన్నారు.

ఇందులో 'లోకచుక్క' గారి సంఘ సంస్కరణ పతాక మో? కాంతగారి సనాతన విజయపతాక మో చదువరులకే తెలియాలి.

ఇక లవణరాజు కలలో నరపతి గుఱ్ఱం ఎక్కి

ఎక్కడో కానిదేశాలకు వెళ్లి చాలా ఆకలి గొని, తాళవనంలో పాట పాడే పాటలాధరి తండ్రికి అన్నం తీసుకువెళ్తూంటే,

"నిన్న నుండియు నన్న మెఱుగని
యాక లొక వంకన్"
"అంత కన్నను అధికతర మొక
వింత యాకలి మనసు గాంచగ"
"భృత్యునై తిని నీదు మూర్తికి
భృత్యునౌదును నీకు సుందరి"
"మృత్యుముఖమున నున్న భటునకు
నన్న మీవలవో"

అని వెంబడిస్తాడు. అప్పు డా సుందరి,

"వన్నెమీరిన మేని వసతో
కన్ను మణగెడి రత్నరుచితో
నన్ను తెలియక నాసచేసెద
వయ్యో మాలి తనెన్"
"అయ్యకోసము కూడు కొందును
ఇయ్యలే" ననుచు హృదయము వ్రయ్యలు

చేసికొనియే బదులు చెప్పింది. అయినా దానికి గూడా ఒడబడి కులవివక్ష విచక్షణారహితమని ఒక్క ఉపన్యాసం చేసి,

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి అన్నది మాలయైతే
మాలనే అగుదున్" అని కూడా ఆమె కోసం

దిగజారాడు.

అప్పటికీ ధర్మ మెఱిగిన ఆ మాల కన్య,

"తండ్రి కోసము తెచ్చు కూటిని
తిండికై యొరు కెట్టు లిత్తును
పెండ్లి యాడిన పెనిమి టొకనికి
పెట్ట ధర్మంబే" నని కుండ బ్రద్దలు గొట్టి

చెప్పేసింది. అంతతో తనివి పొందక "తడవు ఆయెను తండ్రి నాకై యెదురు చూచును..."అని తనను తొలగి తొందరగా దారి యిమ్మనే భావం కూడా కనబఱచింది. తరువాత నరపతి "పెండ్లి యాడెద చంద్రుసాక్షిగ పెట్టుకూడు..."అన్నాడు. అప్పుడు గాని ఆ బాలిక అన్నం పెట్టలేదు.

వయసులో పసిదైనా, ధర్మదీక్షలో తల నెఱసినదే.

ఇక్కడ ధర్మానికీ, వెల యెఱుగని వెఱ్ఱిప్రేమకూ సంఘర్షణ జరిగింది. ఆఖరుకు అభిమానధనమైన మానినీ ధర్మమే జయించింది. మోహానికి స్థిరమైన ప్రణయరూపాన్ని సిద్ధింపజేస్తేనే కాని ప్రణయమునే కాని వెఱ్ఱిచవుల పేరిటి మఱుల మాయ లెఱుగని మాలకన్య మహీపతికి మనస్సియ్యలేదు.

'కన్యక' లోనూ ఇంతే. 'కండకావర మెక్కి' నరపతి 'దుండగము తలపెట్టి' వీరభద్రుని దేవళానికి వెళ్ళే కన్యను బలిమిని పట్టబోతే—

"పట్టమేలే రాజు అయితే
రాజు నేలే దైవముండడొ
కండకావర మెక్కి నీవీ
దుండగము తలపెట్టినందుకు
వుండడా వొక దైవమంటూ
వుండి వూర్కొనునా ?
పట్టమేలే రాజువైతే
పట్టు నన్నిపు"

డంటూ కన్యక అగ్నిగుండంలోకి దూకి—

"పట్టమేలే రాజు గర్వం మట్టిగలిసింది"
"యెక్కడైతే కన్యమానం
కాచుకొనుటకు మంటగలిసెనొ
అక్క డొక్కటి లేచె సౌధము
ఆకసము పొడుగై"

ఇది మచ్చలేని కన్యకాదేవి యొక్క మానరక్షణ కీర్తిసౌధం!!

"డామన్ పితియసు"లో కూడా రాజుయొక్క కోపానికి గురియై ఉరిశిక్ష విధింపబడిన డామన్ తన ఊరువెళ్ళి భార్యాబిడ్డలను చూచుకొని రావడానికి ఒక నెలరోజులు గడువుకోరగా, డామన్ యొక్క ఆప్తమిత్రుడైన పిథియస్ ఆ నెలరోజులూ డామన్ బదులు ఉండుకువగా తాను చెఱసాలలో ఉండడానికి అంగీకరిస్తాడు. కడపట గడువురోజువఱకు డామన్ రాలేకపోయేసరికి పిథియసు భార్యా, స్నేహితులు కళవళ పడ్తారు, పిథియసు భార్య తన భర్త అకారణ మృతికి చాలా వ్యసనపడి—

"చదువువారికి వెఱ్ఱిభ్రాంతులు
మెదడు కెక్కిన పాయవందురు"
"బతకవలసిన కాలముండగ
బతుక నొల్లమికంటె పుట్టునె?"
"తప్పు వొకయెడ దండ మొకయెడ
వొప్పెయని నరపతికి దోచిన
వొప్పగించెద నాదు ప్రాణము
డమను కన్నంతన్"

అని ఉన్న సత్యాన్ని విడమర్చి చెప్పడమే కాక. తప్పు ఉన్నా లేకపోయినా ప్రాణానికి ప్రాణం ఇయ్యడమే కావలసి ఉంటే నా కళ్ళముందు నీవు బలికావద్దు. ఉరిశిక్ష నేను పొందుతాను. అని తాను రాజుగారి అన్యాయానికి ఆత్మార్పణం చేయబూనుకొంటుంది.

ఇంతలో డమనుడు రానేవస్తాడు. రాజు డమనుణ్ణి క్షమించి ఉరిశిక్ష రద్దు చేస్తాడు. రద్దు చేయడమే కాక

"విద్య యందలి మాయమర్మము
దిద్ది చెప్పిందబల యొక్కతె
విద్యలెఱుగని ప్రేమ భరమును
వింతగా చూపెన్."

అని పిథియసు భార్యను గౌరవిస్తాడు.

'దిద్దుబాటు' అనే కథలోని కథానాయిక కమలిని చాలా వివేకవతి, వేశ్యాసక్తుడై, మఱల పశ్చాత్తప్తుడైన భర్తకు చిన్న నీతి పాఠం నేర్పుతుంది. కాని కాలానికి తలవొంచి ఏడుస్తూ కూర్చోదు.

"మీ పేరేమిటి" కథలోని నాయిక నాంచారమ్మ కూడా చాలా గొప్ప ప్రాజ్ఞురాలు. మూఢభక్తుడైన మనవాళ్ళయ్య, వీరశైవులు గుండం త్రొక్కుతూంటే మన వైష్ణవులుకూడా త్రొక్కవలసిందే అంటూ గుళ్లో ముదుసలి ఆచార్యులుగారిని చెయ్యిపట్టి లాగుతాడు. అతగాని ధూర్తత్వానికి ఎవ్వరూ కాదనలేరు. కాని గుండం తొక్కలేమని అందఱకూ తెలిసి ఈ వేళతో ఆచార్యులగారికి చావు మూడిందని భయపడ్తారు, ఆ సమయంలో ఆచార్యులుగారి కోడలు నాంచారమ్మ కలుగజేసుకొని ఉపాయంగా తన మామగారిని తప్పించి మనవాళ్ళయ్య చేతనే గుండం త్రొక్కిస్తుంది. నాంచారమ్మ తెలివి తేటలకు మామగారూ, భయపడి అటకమీద దాక్కున్న భర్తా, అందఱూ సంతోషిస్తారు.

ఇట్లా అపరిమిత ప్రజ్ఞా ప్రాభవాలు కల స్త్రీ పాత్రలను కూర్చిన ముత్యాలసరాలుగా పేర్చి ముత్యాలసరాలలోనూ - కథలలోనూ మగపాత్రలనే కాదు యావదాంధ్ర సారస్వతాన్నే ప్రకాశింప జేశారు, అప్పారాయ కవివర్యులు!!

ఇన్నిపాత్రలూ ఒక యెత్తూ పూర్ణమ పాత్ర ఒక్కటీ ఒక యెత్తూను. పూర్ణమ్మ నిజంగా తెలుగుల సారస్వతాంగణంలో నిత్యమూ పూసిన ముత్తైదువుగా తిరిగే పుత్తడి బొమ్మయే.

"పూజారింటను పుట్టెను చిన్నది
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా
కానుకులోనై తల్లితండ్రి

నెనరూ న్యాయం వీడీ
పుత్తడిబొమ్మను పూర్ణమనూ
ఒక ముదుసలి మొగుడికి ముడివేస్రీ"

కొన్నాళ్ళకు పతి తన్ను కొనిపోరాగా-అందఱకూ నమస్కారాలుచేసి...

"నలుగురు కూర్చొని నవ్వేవేళల
నా పేరొకతరి తలవండి
మీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి"

అని పదిలంగా చెప్పి బలబలకారే కన్నీటితో పూర్ణమ్మ దుర్గను పూజించడానికి ఒంటరిగా వెళ్లింది. ఆవులు పెయ్యలు మందలతో ఇంటికి వచ్చాయి. కాని ముసలి మొగుడికి తన్నిచ్చి పెండ్లిచేశారనే అభిమానంతో లోలోపలనే కుతకుత ఉడికిపోతూ ఉన్న పూర్ణమమాత్రం మఱి యిల్లు చేరలేదు. 'దుర్గను జేరెను పూర్ణమ్మా' అని పూర్ణమ్మ బంగారు బ్రతుకుకు పర్యవసానం చెప్పారు; శ్రీ అప్పారావుగారు!

కాలమూ, కాలములోని సంఘాచారమూ బలీయమైనవి—సంఘాచారపు సంకెళ్ళనుండి తప్పించుకోలేక, కాలంయొక్క కరాళదంష్ట్రిలలో చిక్కువడడం ఇష్టంలేని పుత్తడిబొమ్మలంతా సంపూర్ణ భావస్వాతంత్ర్యంకల అభిమానధనియైన పూర్ణమనే అనుసరిస్తారు. ఇట్లా కొన్ని నిండుప్రాణాలు పూర్ణాహుతి అయితేనే తప్ప, అటువంటి దురాచారాలు రూపుమాసిపోవు.

ఈ నీతినే పూర్ణమపాత్రద్వారా గురుజాడవారు మన కెఱుకపరుస్తారు.

ఇట్లా స్వయంవ్యక్తిత్వమూ, స్వార్థత్యాగమూ చేయలేనివారు కన్యాశుల్కంనాటకంలోని బుచ్చెమ్మ, మీనాక్షమ్మ, వెంకమ్మలవలె జీవచ్ఛవాలైపోయి కాలగర్భంలో విలీనమైపోతారు.

ఏమైనా అటువంటి ఇరువాగులలోని త్యాగచరిత్ర పునాదులపైననే నేటి మహిళాస్వాతంత్ర్య సౌధం చెక్కుచెదరకుండా నిలిచి ప్రకాశిస్తూ ఉన్నదన్నమాట మాత్రం పరమసత్యం!

కాలగతినే ప్రకాశింపజేసే మేలిమి బంగరు మెలతలనూ, పుత్తడిబొమ్మలనూ పూర్ణపుష్టితో చిత్రించి కూర్చిన ముత్యాలసరములతో ఆంధ్ర సరస్వతిని, ఆంధ్రదేశాన్ని అలంకరించిన అప్పారావుగారు తెలుగువారికి సదా సమ్మాన్యులు.

★

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/